# బుద్ధిచెప్పిన ఎన్నికలు

**తిరునగర్**

నేను శక్తి కొద్దీ నోరు కొట్టుకొని చెపుతూనే వున్నా – "వద్దురా బాబూ ఆ వ్యవహారాల"ని. నామాట వింటేనా? ఏదో, తానో నాయకుడు అయిపోయి, ప్రపంచాన్నంతా జయించాలని కాబోలు వాడి వుద్దేశ్యం. అరె! మొన్న మొన్నటి వరకూ ఎంత మంచివాడు! వాడి చదువేమిటో వాడేమిటో తప్ప యితరులతో మాట్లాడేవాడా? ఎవరు నేర్పాడో గానీ, ఆపిచ్చి బాగా నెత్తికెక్కింది.

"ఒరె! ఆ విషయాల్లో జోక్యం కలిగించుకొని, ఆ పిచ్చిలో తిరిగేవాళ్ళెంత వరకు ఎవ్వరూ బాగుపడలేదురా!" అన్నాను-చెప్పి చూద్దామన్న వుద్దేశ్యంతో.

"నేను బాగుపడకపోతే మాత్ర మేమిటిరా? నావల్ల ఎంతోమంది బాగుపడుతూ వుంటేనూ. మహానుభావుడు రామానుజాచార్యు లేమన్నారు? గురువుగారు మంత్రోపదేశం చేసి దీన్ని జపిస్తే స్వర్గప్రాప్తి అనీ, యితరులకు చెపితే నరకప్రాప్తి అనీ చెప్పారట. ఆయనేం చేశాడు? సహచరు లందరికీ ఆ మంత్రాన్ని ఉపదేశించాడు. గురువర్యులు ప్రశ్నించగా ఏమన్నాడు? 'నావల్ల అంతమంది స్వర్గానికిపోతే నేనొక్కణ్ణీ నరకానికిపోతే నేమి మహాత్మా?' అన్నారుట. అదీ వాడి సమాధానం!

దీన్నిబట్టి చూస్తే అప్పటికే ఆ కేసు నా చేతులోంచి జారిపోయినట్లే కనిపించింది. రోగికి పైత్యం బాగా తలకెక్కింది. ఇక దాన్ని వదిలించాలంటే మళ్ళా విష్ణుమూర్తి పదకొండో అవతారం దాల్చాలి.

రెండుమూడు రోజులుగా కన్పించని కృష్ణమూర్తి ఒకరోజు వచ్చేసి సీరియస్‌గా నాప్రక్కన కూర్చున్నాడు. అప్పుడేవచ్చి హోటల్లో టిఫిన్ తీసుకొంటున్నాను. ఇంకా కాలేజీకి వేళ గాలేదు.

"అసలు సంగ తేమిటిరా?" అని అడుగుదా మనుకున్నాను. కాని వాడి ముఖం చూచి అడగ బుద్ధివెయ్యలేదు. కొంచెం సేపుంటే వాడే చెపుతాడనుకొని యింకో ప్లేటుకు ఆర్డరిచ్చి, నా తిండి గొడవలో నేనున్నట్లే నటించాను. కృష్ణమూర్తి మొఖంచూస్తే వాడేదో పెద్ద ఆలోచనతో సతమత మవుతున్నట్లు కనిపించింది. సర్వరు ప్లేటు తెచ్చి వాడి ముందుంచాడు వాడదేమీ ముట్టుకోకుండానే.

"నేను కాలేజీ యూనియన్ ప్రెసిడెంటుగా నుంచుంటున్నాను." అన్నాడు. చెప్పొద్దూ. నేను నిజంగా నమ్మలేదు. హాస్యంగా అంటున్నాడని భ్రమపడి" "నుంచో. తప్పకుండా నువ్వే గెలుస్తావు అన్నాను, సీరియస్‌గా అంటున్నట్లే నటిస్తూ.

"అందరూ అలాగే అంటున్నారు." అన్నాడు మెల్లిగా హోటల్ నాలుగు మూలలు చూస్తూ కృష్ణమూర్తి.

"నువ్వు ప్రెసిడెంటువుతే కాలేజీ స్వర్గంలా తయారవుతుంది" అన్నాను.

"అయితే నీ ఓటు ఎటు వెయ్యదలుచుకున్నావు?" అని ప్రశ్నించి, ఆత్రంతో నా ముఖంలోకి చూచాడు.

"చచ్చినా నీకు మాత్రం వెయ్యదలుచుకోలేదు."

తమాషాకని సమాధానం చెప్పి, అంతవిట్టు, ఉపయోగించినందుకు గర్వంగా వాడి ముఖంలోకి చూచాను.


కృష్ణమూర్తి ముఖం ఎఱ్ఱబడిపోయింది. వాడి పరిస్థితి చూస్తే నాకప్పు డర్థమయింది, వాడు చెప్పిందంతా నిజమేనని.

"పోనీ దానికి కారణం చెప్పగలవా?" అన్నాడు మెల్లిగా.

"అసలువిషయ మేమిటో చెప్పరా! ఎందుకు నిలబడుతున్నావు? ఎవరు నిన్నలా చేయమని చెప్పారు? ఏమిటీ కథ? నాకేమీ తెలియకుండా వచ్చేసి 'నీ ఓటు నాకిస్తావా?'అని అడిగితే ఎలాగు? ఇదేమన్నా మునిసిపల్ ఎలక్షననుకున్నావా?"

ఇక వాడు చెప్పడం మొదలుపెట్టాడు. వాడు చెప్పినదాన్నిబట్టి తేలిందేమిటంటే- క్లాసులో వున్న అంతమందీ వచ్చి వీణ్ణి నుంచోమని ప్రోద్బలం చేశారుట. ఇక మొత్తంమీద రెండు క్లాసుల ఓట్లు వస్తే తప్పక గెలుస్తాడుట. కాలేజీ అన్ని క్లాసుల్లోనూ మొత్తం నలభైమంది ఆడపిల్లలున్నారు. వాళ్ళకు తనమీద ప్రత్యేకాభిమానం వుందని కృష్ణమూర్తి నమ్మకం. తప్పకుండా తనకే ఓటు చేస్తారంటాడు. అందుచేత నిస్సందేహంగా గెలుస్తానని తలంపుతో వాడికి నుంచోవాలనిపించిందిట.

"ఒరేఁ! నిలబడతా, నిలబడతానని ఉబలాటపడుతున్నావుగానీ నిలబడి ఏంచేస్తావురా?"అన్నాను.



"ఏంచేస్తానో ముందు ముందు నీకే తెలుస్తుంది నీ కళ్లతో నువ్వే చూద్దువుగాని. కృష్ణమూర్తి ప్రెసిడెంటుగావున్నాడంటే కాలేజీ అంతా మాతెత్తిపోవాలి. విద్యార్థుల హక్కులకోసం పోట్లాడతాను. విప్లవం వర్ధిల్లజేస్తాను" అన్నాడు ఆవేశంతో.

"అయితే నువ్వీ కాలేజీని వదలదలుచుకోలేదన్నమాట."

"ఏం? ఆలా అడుగుతున్నావు?"

"ఈ బి. యే. ప్యాసవడానికేనా, ఈ వెధవ వేషాలన్నీ? మీనాన్నకు తెలిసిందంటే నీ తాట వలిచేస్తాడు. ఎవరో నుంచుంటున్నారంటే - వాళ్లకేమిటి? లక్ష్మీపుత్రులు వాళ్లు డబ్బెలా ఖర్చుగాను? వాళ్ళెన్ని సంవత్సరాలు తప్పినా ఫరవాలేదు. నీ వంటివాడు తప్పాడంటే నీముఖం ఎవరేనా చూస్తారా? పిచ్చి పిచ్చి వేషాలు వేయకుండా మెదలకుండా వూరుకో!" అని హితబోధ చేశాను.


"గురువచనం బతి నిర్మలంబయ్యు సలిలంబునుంబోలె శ్రవణస్థితంబై యభవ్యునికి శూల పుట్టించునని." శ్రీనాధకవివర్యులు సెలవిచ్చినట్లు నా హితబోధ వాడి చెవికెక్కలేదు సరిగదా రోషం కూడా వచ్చింది.

"పెద్ద నువ్వే ప్యాసయేవాడివిరా... చూద్దాంగా ఎందుకు ప్యాసుకానో. ప్రెసిడెంటు పదవిలోవుంటే ధంకామీద దెబ్బకొట్టి మరీ ప్యాసవుతాను. ఏమనుకుంటున్నావో! నువ్వెన్ని చెప్పినా ఇక లాభంలేదులే! నువ్వు నామీద అభిమానంతో ఓటు వేస్తే వెయ్యి. లేకపోతే లేదు" అని అక్కణ్ణించి కాఫీ అయినా త్రాగకుండా లేచి వెళ్లిపోయాడు.

సరే ఇక వాడి మనస్సు మార్చడానికి ప్రయత్నించడం "చేరి మూర్ఖుల మనసు రంజింప" చేయడమే అవుతుందని, వాడికే ఓటు వేయడానికి నిశ్చయించుకున్నాను.

టైము కాగానే క్లాసుకు వెళ్లాను. ప్రతిరోజూ నా ప్రక్కనే కూర్చొనే కృష్ణమూర్తి సీటు, మూడు నాలుగు రోజుల్నించీ ఖాళీగానే వుంటోంది. ఈరోజూ అంతే. నేనింతకుముందే హోటల్లో చూశాను. ఇంక కాలేజీకి రాలేదని ఎలా అనుకుంటాను? బహుశా లేటుగా వస్తాడేమో ననుకొని సమాధానపడ్డాను. పిరియడు సగం గడిచినా వాడి జాడ లేకపోయేసరికి, ఈమధ్య వాడి వెంట జోరుగా తిరుగుతున్నవాణ్ణి అడిగాను "కృష్ణమూర్తి ఎక్కడ?" అని.

"కేన్వాసింగ్‌కి తిరుగుతున్నాడోయ్," అన్నాడు. క్లాసులు ఎగ్గొట్టి పదవీ వ్యామోహంతో తిరుగుతున్న కృష్ణమూర్తిని నాచి



ప్రక్కనేవున్న వ్యక్తి దుడ్డుకర్ర పట్టుకుని యుద్ధానికి సిద్ధమైన సైనికుడి పోజులో నిలబడ్డాడు.

విచారించాలో సంతోషించాలో తెలియ లేదు నాకు.

ఇక వాడు క్లాసుకు రావడమే మానేశాడు. నామినేషన్లు కూడా అయిపోయాయిట. కృష్ణమూర్తి పేరు కూడా నోటీసు బోర్డులో వేశారు, తాటికాయంత అక్షరాలతో, ప్రెసిడెంటుగా పోటీచేస్తున్నట్టు.

కృష్ణమూర్తి పోటీదార్లు యిద్దరిలోనూ కాస్త పేరుగలవాడు వెంకటేశ్వర్లు. అతనికీ పదవీవ్యామోహం లేదని చెప్పలేం గానీ మావాడి కున్నంతగా కన్పించలేదు. అసలు కృష్ణమూర్తికి ఈ వుందు పుట్టకముందు వెంకటేశ్వర్లొక్కడ్నే పోటీ లేకుండా గెలిపిద్దామని విద్యార్థుల వూహ. కృష్ణమూర్తి

# ★ బుద్ధిచెప్పిన ఎన్నికలు ★

నిలబడేసరికి పార్టీలు బయలుదేరాయి. పార్టీలు పడినప్పటినుంచీ వెంకటేశ్వర్లుకు పట్టుదల ఎక్కువైంది.

ప్రచారం జోరుగా సాగుతోంది. విద్యార్థుల యిళ్ళకు ప్రతిరోజూ అన్ని పక్షాల వారూ తెగ తిరిగేస్తున్నారు. ఎన్నికలు మూడు రోజు లున్నాయనగా కృష్ణమూర్తి, వాళ్ళ పార్టీవాళ్ళను వెంటపెట్టుకొని మా యింటికి వచ్చి నన్ను కేక వేశాడు. బయటకు వచ్చి చూస్తే అబ్బో! పెద్దపెద్ద తలలు గల ప్రముఖులంతా అక్కడ వున్నారు.

"మే మెందు కొచ్చామో తెలుసు ననుకుంటాను" అన్నాడు పార్టీలో ఒకడు. ఇంతలో కృష్ణమూర్తి అందుకొని "ఏమండోయ్. వాడు మీకు క్రొత్త గానీ, వాడికీ నాకూ వున్న స్నేహం ఈనాటిది గాదు. ఏదో మన విధిప్రకారం కనబడడానికి వచ్చాం గానీ, వాణ్ణి అడగాలటండీ," అంటూ నా చేతిలో ఏదో కాగితం పెట్టాడు.

వాడి ధోరణి చూచి పార్టీవాళ్ళలో నే యిద్దరు గుసగుసలాడుకొంటున్నారు. "మన వాడికి గూడా పట్టుబడిందే పద్ధతి" అని.

వాళ్లు వెళ్ళిపోగానే కాగితం చూద్దునుగదా! ఓహో! అర్ధపేపరుమీద కృష్ణమూర్తి ఫోటో వేయించేసి "కాలేజీ బాగుపడాలంటే, విద్యార్థులు తమ హక్కులు కాపాడుకోవాలంటే, కృష్ణమూర్తికే ఓటు వేసి గెలిపించండి" అని వ్రాసివుంది. ఆ ప్రచారపత్రం చూస్తే, మొత్తంమీద కృష్ణమూర్తి చేతి చిలుం బాగానే వదిలిందని తెలుస్తూంది.

కాలేజీలో పార్టీలు ప్రచారం గురించి చెప్పనే అక్కరలేదు. రోజులు దగ్గర పడుతున్నాయి. ఆ పుణ్యకాలం కాస్తా సమీపించింది. పోలింగు మొదలుపెట్టారు. కృష్ణమూర్తి ఆరోజు కాలేజీలోగానీ, ఎక్కడా గూడా కనిపించలేదు. తీరా నేను ఓటు చేయడానికి వెళ్ళాను. ఎంత వెదికినా మా కృష్ణమూర్తిగాడి పెట్టె కనిపించలేదు. తెల్లముఖం వేసి విధిలేక యింకో పెట్టెలో వేసి బయటికి వచ్చాక నోటీసుబోర్డు చూస్తే కృష్ణమూర్తి నామినేషన్ ఉపసంహరించుకున్నట్లు వుంది!

వాడి పార్టీవాణ్ణి ఒకణ్ణి పట్టుకొని అడిగాను "ఏమోయ్! కృష్ణమూర్తి విత్‌డ్రా చేసుకున్నాడట. ఎందుచేత?" అని.

"ఏమోనండి. నిన్నటివరకూ బాగానే వున్నాడు. రాత్రి ఏం జరిగిందో ఏమో! తెల్లవారేసరికి ఈ పదవి నాకవసరం లేదంటూ కూర్చున్నాడు" అన్నాడు.

నా కొకటి తోచింది. ఇదివర కెప్పుడూ నే నేదైనా సలహాయిస్తే వాడు త్రోసి వెయ్యలేదు. ఆలోచించగా ఆలోచించగా నా హితబోధ వాడికి చివరికి తలకెక్కి వుంటుందనుకున్నాను. సాయంత్రం వెళ్ళి వాణ్ణి కలుసుకున్నాను. రూములో ముసుగుపెట్టుకొని పడుకొనివున్నాడు. నేను గాబరాపడ్డాను. ఆదుర్దా ఆగక వాణ్ణి నిద్రలేపాను. నన్ను చూచి ఏమీ ఆశ్చర్యం కనబరచకుండానే, వళ్లు విరుచుకొని "అలా కూర్చో," అన్నాడు కుర్చీ చూపిస్తూ.

"వంట్లో ఎలావుంది?" అన్నాను.

"వంట్లోకేం? బాగానేవుంది. ఒక నెల రోజులనుంచీ సరిగ్గా తిండీ, నిద్రా లేదురా!" అని పెద్దగా ఆవులించాడు. వాణ్ణి చూస్తే నాకాశ్చర్యం వేసింది. అంత ఆర్భాటం చేసినవాడు తన కేమీ తెలియనట్లు నిశ్చింతగా నిద్రపోతూవుంటే నిజంగానే ఆశ్చర్యం కలిగింది.

"అలా బయటికి వెళదాం వస్తావా?" అన్నాను.

"పద!" అని పక్కమీదినుంచి లేచాడు. పీక్కుపోయిన వాడి కళ్ళు ఆ వైనం చూస్తే భోంచేసినట్లు లేదు. హోటలుకు తీసికెళ్ళి యిద్దరం సుష్టుగా భోంచేశాం.

వాడూ ఏదో ఆలోచిస్తున్నాడు. ఇది నా బోధఫలితమేనని నేను లోలోననే గర్వపడుతున్నాను. నడుస్తున్నాం యిద్దరమూను. సముద్రపు ఒడ్డు చేరుకొని చతికిలపడ్డాం. అప్పటికే అక్కడ జనసంచారం తగ్గిపోయింది. వెన్నెల వచ్చింది.

"నువ్వలా ఎందుకు చేశావురా?" అన్నాను.

"పోనిద్దూ. వెధవది. అయిపోయిం దేదో అయిపోయింది."

"నాతో గూడా చెప్పగూడదు గాబోలు."

"నీతో వచ్చిన చావే ఇది......"

"పోనీలే! నా కెందుకు చెపుతావురా నువ్వు?"

"అన్నావూ! అయితే విను" అని వాడు మొదలుపెట్టాడు.

"మా పార్టీవాళ్లు ఒక కార్యక్రమం తయారుచేశారు. అందులో ఆడపిల్లల యిళ్లకు వెళ్లడం చిట్టచివరకి వేశారు. దాని ప్రకారం బయలుదేరాం. నిర్మల తెలుసుగా! వాళ్ల యిల్లు ఊరిచివర. ముందుగా

> గేట్ కీపర్:- ఇదేమిటి హాఫ్ టికెట్ తీసుకువచ్చావ్... ఇంత పెద్ద వాడివి... నీవయస్సెంతయ్యా?
>
> అతను:- బాబూ! నా వయస్సు ముప్పై ఏళ్లు. కానీ నాకు ఒక్కకన్ను లేదు. నేను అందరిమల్లే రెండు కళ్లతో సినిమా చూడలేను...
>
> "మహేష్"

అందరం బయలుదేరి నిర్మల యింటికి చేరాం.

"అప్పటికి తొమ్మిది గంటలు దాటింది. ఆ వీధిలో మునిసిపాలిటీ దీపాలు ఉన్నా, అంతా చీకటిగానే వుంది. మేం వెళ్లేసరికి ప్రహరీగోడ తలుపులు తీసేవున్నాయి. ఆ ద్వారం దాటి ముందు కెళ్లాం. ఇంటి తలుపులు వేసివున్నాయి. కిటికీచువ్వల సందుల్లోనుంచి దీపపుకాంతి యివతలకొస్తోంది. బయటవరండాలో గేదెదూడ కట్టేసివుంది. ఇంటికి ముందు ఎడమప్రక్క గొడ్ల చావిడల్లే వుంది, వాసన కొడుతోంది. వరండాలో రెండు మూడు గడ్డిమోపులు. గదంతా చెత్తతో కప్పివేసివుంది. మాలో ఒకడు కిటికీదగ్గర కెళ్లి లోపలకి తొంగి చూశాడు. ఒక అమ్మాయి, ఓ మగవాడు మాట్లాడుకొంటున్నారట. ఆమె పిల్లకు పాలిస్తూ వుందట.

"ఏవండీ" అని మెల్లిగా పిలిచాడు మావాడు.

ఆ అమ్మాయి అదిరిపడి "ఎవరు?" అంది. ప్రక్కనే వున్న వ్యక్తి మూలనున్న దుడ్డుకఱ్ఱ పట్టుకుని యుద్ధానికి సిద్ధమైన సైనికుడి పోజులో నిలబడ్డాడు. ఎవరన్నా లోపలికి వస్తే కఱ్ఱతో బుఱ్ఱ బద్దలయేట్టు కొట్టడానికి సిద్ధంగా వున్నాడు.

ఆయన అవతారం చూచి మావాడు దడుసుకున్నాడేమో, కంఠం ఇంకొంచెం తక్కువస్థాయిలోకి తెచ్చుకొని "మేం వేశాం, వోటుసంగతి తెలుసునండీ! ఒక్కసారి తలుపు తీయండి" అన్నాడు. వాడి గొంతు వణుకుతూవుందని తెలుస్తూనే వుంది.

"ఒక్క ఓటు పోతే పోయిందిలేరా - రండి పోదాం" అన్నాను నేను.

"నీకు తెలియదులే! ఇంతమాత్రానికే

వెళ్ళిపోతే మనం సంపాదించామే" అన్నాడు నా ప్రక్కతను.

"మీరంటే ఎవరికి తెలుసు? పేరు చెప్పు" అని గద్దించింది లోపల్నించి.

మేమండీ! కాలేజీ కుఱ్ఱాళ్ళం" అన్నాడొక పార్టీ వర్కరు.

"ఘః! మీయమ్మ కడుపు మాడ" అని మెల్లిగా అనుకొని, బిగ్గరగా "ఎందుకొచ్చారు?" అంది.

"వెళ్ళిపోదాం పదండిరా!" అని చెబుదామనుకున్నాను గానీ, నా ప్రక్కతను "యిస్" అన్నాడు ముక్కుమీద వేలు వేసికుని.

"మీ అమ్మాయితో కాస్త పనివుందండీ."

ఆమె కంఠం జోరుచేసి "మీపని మరీ ఆటగా వుందే? మాటమాటకీ ఎందు కిట్లా వస్తారు? ప్రొద్దున్నించి చూస్తున్నాం. కుక్కల్లాగా తిరుగుతున్నారు. యిప్పటి కిది మూడోసారి. మీకేం వేళాపాళా లేదూ? ఈ దఫా వచ్చారంటే మర్యాదగావుండదు ఏమిటనుకున్నారో. ఫోండి" అంది.

నా కప్పు డర్థమయింది. ఇంతకుముందే వెంకటేశ్వర్లు తరఫువాళ్ళు వచ్చి వెళ్లారని. ఆ మహాతల్లి వాళ్లే వీళ్ళని ఆ రెండూ మా మీద దులిపింది. నా జన్మలో ఇంతవరకూ ఎవరివల్లా ఒక్క పల్లెత్తు మాటయినా పడలేదు. నా మిత్రులంతా ఏమీ పెద్ద అవమానం జరగనట్లే వున్నారు. అంటే అటువంటి వెన్నో తిన్న ఘటాలన్నమాట! ఒక్క ఓటుకే యింత రభసయితే, యిన్ని యిళ్ళు ఎలా తిరగడం? అందరూ యింతేగా? నా మనస్సు చివుక్కుమంది. ఛ! ఛ! ఇది నీచం, అనిపించింది.


మహాతల్లీ బుద్ధివచ్చేట్టు చేశారమ్మా! ఇంకా ఎంతోమంది యిళ్ళకు వెళదామనుకుంటున్నాం. మీ దంపతులిద్దరూ మంచి వాళ్ళకనుక దేహశుద్ధి చేయలేదు. ఇంకెక్కడైనా అయితే అది తప్పదు. అని మనసులో అనుకొని ప్రెసిడెంటుపదవికి ఓ నమస్కారబాణం అర్పించి, మా వాళ్లెన్ని చెప్పినా యింకో యింటికి రానని చెప్పేసి రూముకొచ్చి ముసుగుపెట్టాను. తెల్లవారి లేచి కాలేజీకి వెళ్లి నా పేరు 'విత్‌డ్రా' చేసుకున్నాను" అని పూర్తి చేశాడు కృష్ణమూర్తి.

అయితే వీడు మారింది నావల్ల కాదన్న మాట! ఏమయితేనేం మళ్లీ కృష్ణమూర్తి మారినందుకు నాకు సంతోషం కలిగింది. "లేరా. సినీమాకు వెళదాం" అన్నాను, నాకేదో పెద్ద పరీక్ష ప్యాసయినట్లు.

*　　*　　*

పైన చెప్పిన విషయాలన్నీ ఎప్పుడో చిన్ననాటివి. బి. ఏ. పరీక్ష యిచ్చిన తరవాత కృష్ణమూర్తీ, నేనూ విడిపోయాం. అప్పటినుంచీ వాడెక్కడున్నాడో తెలుసుకోడానికి ప్రయత్నించినా వాడి జాడ దొరకలేదు.

ఇటీవల తాహసిల్దారుగా ఓ వూరు వెళ్లాను. ఒక లక్షాధికారి నాకు స్వాగత మిచ్చాడు. వాడే కృష్ణమూర్తి. భార్య తరఫున చాలా ఆస్తి వచ్చిందిట. ఆ గ్రామస్థులు వచ్చి కృష్ణమూర్తిని పంచాయతీ బోర్డు ప్రెసిడెంటుగా నిలబడమని ప్రాధేయపడుతున్నారు. కాని కృష్ణమూర్తి ఒక్కటే సమాధానం చెప్పాడు వాళ్ళకి: "నా జీవితంలో అలాటి ఛండాలపు పని ఎప్పుడూ చేయను" అని నావంక చూచాడు. వాళ్లు వెళ్లిపోయాక "ఇలా చేసింది నువ్వే కదురా!" అన్నాడు. ★



మహాబలేశ్వరం సమీపంలో ప్రతాపగఢంలోని భవానీ దేవాలయ స్తంభాలు.

ఫోటో: శ్రీ వి. ఆర్. సబ్నవీసు, బొంబాయి.